## క్లుప్తంగా

### పాల దిగుబడి పెంపుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ బేబీరాణి

**చీమకుర్తి:** మండలంలోని ఆర్ఎల్ పురం గ్రామంలో పాడి రైతులకు పాల దిగుబడి పెంపుపై వెటర్నరీ జేడీ డాక్టర్ కే బేబీరాణి శుక్రవారం అవగాహన కల్పించారు. టీఎంఆర్ దాణా అందించడం వలన కలిగే ప్రయోజనాలు, పశుసంవర్థకశాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ, సెక్స్ సార్టెడ్ సెమన్, ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన సంతనూతలపాడు ఎంపీడీవో



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రాఘవేంద్ర

**చీమకుర్తి:** సంతనూతలపాడు ఎంపీడీవోగా కే రాఘవేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై సంతనూతలపాడు వచ్చారు. గత 19 నెలలుగా సూపరింటెండెంట్ డీఎస్‌వీ ప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

### నేడు చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి

**ఒంగోలు:** అభినవ బండారు రామారావు బిరుదాంకితుడు చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతిని శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక నెల్లూరు బస్టాండు సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఏపీ పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎం.శాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాపోషకులు, కళాభిమానులు, కళాకారులు పాల్గొని నివాళులర్పించాలని కోరారు.

### ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

**ఒంగోలు:** జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి కోరారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో సీపీఐ పోరుబాట వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ నిర్మాణ సామగ్రి ధరలు, కూలి ఖర్చులు పెరిగినందున ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలకు బదులుగా రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీ వరకు జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలపై సంతకాలు సేకరించనున్నట్లు తెలిపారు. 30వ తేదీ మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో బాధితులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు పాల్గొన్నారు.

### జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటుపై అవగాహన

**ఒంగోలు అర్బన్:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు నిత్యావసర సరుకులు, ధరలు అందుబాటులో ఉండేందుకు జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసే అంశంపై శుక్రవారం స్థానిక మెప్మా కార్యాలయంలో 175 సమాఖ్యల పదాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెప్మా పీడీ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సభ్యురాలు రూ.15 షేర్ క్యాపిటల్ చెల్లింపు ద్వారా పెట్టుబడిదారుగా, నిర్వహణదారుగా, కొనుగోలుదారుగా లాభాపేక్ష లేకుండా నాణ్యమైన నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో అబ్దుల్‌ఖాదర్, సిటి మిషన్ మేనేజర్లు, ఫిషరీస్ ఏడీ ఉషకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### శింగరకొండ దర్శిని

**అద్దంకి:** శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పుష్య మాసం పూర్వాషాడ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

# 110 రోజులు.. 50 వేల గడపలు

- సంతనూతలపాడు నియోజకవర్గంలో విజయవంతంగా గడపగడపకు మన ప్రభుత్వం
- 78 సచివాలయాలకుగానూ 55 సచివాలయాల పరిధిలో పూర్తి
- 50 వేల గడపలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



50 వేల గడపలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడి

**చీమకుర్తి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో..లేదో నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సంతనూతలపాడు నియోజకవర్గంలో విజయవంతమైందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చీమకుర్తి మండలం పులికొండ గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో 50 వేల గడపల సందర్శన పూర్తికావడంతో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ 2022 మే 13న నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 110 రోజుల్లో మొత్తం 78 సచివాలయాలకుగానూ 55 సచివాలయాల్లో గడపగడప కార్యక్రమాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు. పులికొండ గ్రామంతో 50 వేల గడపలను సందర్శించిన సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల కన్వీనర్లు, పార్టీ శ్రేణులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో పాటు వారికి మొదటి నుంచి అండగా నిలిచిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని ఘనంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

**వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం...**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శవంతమైనదని ఎమ్మెల్యే టీజేఆర్ తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రూ.3.11 లక్షల కోట్ల నగదును పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేశారని తెలిపారు. కానీ, టీడీపీ వలంటీర్లుగా వ్యవహరిస్తున్న రామోజీరావు, రాధాకృష్ణలు వారి పత్రికల్లో తప్పుడు ఆరోపణలతో లేనిపోని రోత రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా ఒకటో తేదీ పింఛన్లు ఇచ్చారా అని నిలదీశారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన గత మూడున్నరేళ్లలో ఏనాడైనా ఒకటో తేదీ పింఛన్లు ఇవ్వకుండా ఆపారా..? అని ప్రశ్నించారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలను పక్కాగా అమలుచేస్తూ సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై రామోజీ, రాధాకృష్ణలు విషపు రాతలు రాయడం ఇకనైనా మానుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీలు యద్దనపూడి శ్రీనివాసరావు, వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, తేళ్ల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, మండవ అప్పారావు, స్థానిక నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న నాయకులు

# గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



ఒంగోలు మండలంలో గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, హౌసింగ్ డీఈఈ, ఏఈ, ఏపీవో, సర్పంచ్



కొత్తపట్నంలో జగనన్న లే అవుట్లను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ అర్చన, ఎంపీడీవో సుజాత, హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి

- ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు రూరల్:** మండలంలోని జగనన్న లే అవుట్లలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం ఆయా కాలనీలను సందర్శించి లబ్ధిదారులతో ఎంపీడీవో మాట్లాడారు. అంబేడ్కర్‌నగర్ జగనన్న కాలనీలో 60 గృహాలకుగానూ 14 నిర్మాణ దశలో ఉన్నాయని, క్రిస్టియన్‌పేట కాలనీలో 55కుగానూ 23 వివిధ దశల్లో ఉన్నాయని ఎంపీడీవో తెలిపారు. గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి పేదలంతా గృహ ప్రవేశాలు చేస్తేనే జగనన్న కాలనీల లక్ష్యం నెరవేరుతుందన్నారు. హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్చి 22 ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. అప్పటికీ పనులు ప్రారంభించకుండా మీనమేషాలు లెక్కిస్తే స్థలాలను వెనక్కు తీసుకుని అర్హులైన మరొకరికి ఇచ్చేందుకు వెనుకాడేది లేదని అన్నారు. పలు గృహాలను ఎంపీడీవో, హౌసింగ్ డీఈఈ, ఏఈ, ఏపీవో పరిశీలించారు. గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కరవది గ్రామ సచివాలయంలో ఉదయం 10:30 గంటలకు సిబ్బంది హాజరు పరిశీలించారు. గ్రామంలో ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే గా ప్రభుత్వం గుర్తించిందని, పారిశుధ్య కార్యక్రమాలు, మురుగు కాలువల్లో పూడికతీత పనులు, ఉపాధి హామీ సిబ్బందితో నూతన మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రామరాజు, హౌసింగ్ ఏఈ పృధ్వీ, గ్రామ కార్యదర్శి వేమా శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మణికంఠ, రమీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

**కొత్తపట్నంలో జగనన్న లే అవుట్ల పరిశీలన...**

**కొత్తపట్నం:** హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జగనన్న లే అవుట్లను మండల స్పెషల్ ఆఫీసర్ అర్చన, ఎంపీడీవో పి.సుజాత తనిఖీ చేశారు. బిలో బేస్‌మట్టం ఉన్న 97 మంది లబ్ధిదారులను పిలిపించి మాట్లాడారు. బేస్‌మట్టం ఎందుకు వేయలేదని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పించారు. బ్యాంక్ నుంచి వచ్చే రుణాల గురించి వివరించారు. అన్ని ఇళ్లు ఉగాది నాటికి పూర్తి చేయాలని, కావాల్సిన మెటీరియల్ సిద్ధంగా ఉందని తెలిపారు. సిమెంటు, ఇనుము, కిటికీలు, ఇసుక సిద్ధంగా ఉన్నాయన్నారు. విద్యుత్ త్వరగా వదలాలని, తాగునీరు కూడా ఇవ్వాలని అధికారులను లబ్ధిదారులు కోరారు. ఇప్పటికే విద్యుత్ స్తంభాలు వేసి లైన్ లాగడం పూర్తయిందని, వారంలో విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఏపీఎం రజియా సుల్తాన్ బేగం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**గుండ్లాపల్లి లే అవుట్ బాగుంది : స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీరాణి**

**మద్దిపాడు:** గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుని ఉగాది నాటికి అందరూ ఇళ్లలో చేరేలా చూడాలని మద్దిపాడు మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి ఝాన్సీరాణి సూచించారు. మండలంలోని నాగన్నపాలెం, గుండ్లాపల్లి గ్రామాల్లో జగనన్న లే అవుట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వెంట వెంటనే బిల్లులు వస్తాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారిని పిలిపించి ఇబ్బందులడిగి తెలుసుకున్నారు. బేస్‌మట్టం వేసుకోవడానికి డబ్బు లేకపోతే డ్వాక్రా గ్రూపుల ద్వారా రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకూ డబ్బు ఇస్తున్నట్లు తెలిపారు. ఎక్కువ శాతం మంది ఇంటిలోపల పనులు చేయిస్తున్నారని, లబ్ధిదారులు ముందుగా బయటి వైపు ప్లాస్టింగ్ చేయించుకుని సున్నం వేయించుకుంటే వారికి చివరి బిల్లు మంజూరు చేస్తామని చెప్పారు. గుండ్లాపల్లి కాలనీలో సుమారు 35 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 15 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మండలంలోని అన్ని జగనన్న కాలనీల కంటే గుండ్లాపల్లి కాలనీలో చక్కగా నిర్మాణాలు చేసి ఉన్నాయని ఆమె ప్రశంసించారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. కాలనీకి కేవలం కుళాయిలు ఏర్పాటు చేయడం, సీసీ రోడ్ల నిర్మాణాలు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. దాదాపుగా అన్ని కాలనీల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా పైప్‌లైన్లు వేయించి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాలనీలలో అదనపు సౌకర్యాలను సమకూరుస్తున్నట్లు చెప్పారు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థమైన నీరు ప్రవహించడానికి కచ్చాకాలువ ఏర్పాటు చేయిస్తామని గుండ్లాపల్లి కాలనీ వాసులకు ఆమె తెలిపారు. ఏపీఎం నరేంద్రకుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులు గ్రూపులలో లేనట్లయితే అవకాశం ఉన్న గ్రూపుల్లో వారిని చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని వీవోఏలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ హేమలత, పీఆర్ ఏఈ సునీల్, గ్రామ నాయకులు యేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, జవ్వాజి లక్ష్మీనారాయణ, వెలుగు సీసీలు, వీవోఏలు, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



నాగులుప్పలపాడు: విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సుబ్బారావు

**నాగులుప్పలపాడు:** రోజ్ స్టడీ సర్కిల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 60 మందికి ఉచితంగా సోషల్ స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం దాతలు అందజేసినట్లు స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ తెలగతోటి శ్యామ్యూల్ తెలిపారు. తమ పూర్వ విద్యార్థి అయిన కొలకలూరి వినయ్ ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తూ అతని తండ్రి కొలకలూరి సుబ్బారావు ద్వారా స్టడీ మెటీరియల్ అందజేయడం చాలా సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ అన్నారు.

**కొనగానివారిపాలెంలో...**

**చీమకుర్తి:** సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు, మార్తల తిరుపతిరెడ్డి, డాక్టర్ పీ హరిణి చేతుల మీదుగా విద్యార్థులకు మెటీరియల్ అందించారు.

### అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



వెండికిరీటం, ముఖం అలంకరణలో అమ్మవారు

**చినగంజాం:** స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి దాతలు శుక్రవారం వెండి కిరీటం బహూకరించారు. గ్రామానికి చెందిన మాజేటి కామేశ్వరమ్మ అనే భక్తురాలు ఆలయంలోని అమ్మవారికి వెండి కిరీటం, అమ్మవారికి రూపు, వెండి ముఖం చేయించి శుక్రవారం ఆలయ పూజారి కాకుమాను రాము, కొల్లిపర అప్పారావులకు అప్పగించారు. కార్యక్రమంలో దాతలు కామేశ్వరమ్మ, మురళి, రమణ, భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయాలి

- ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, హౌసింగ్ డీఈ

**ఒంగోలు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేస్తోందని, వాటిని అర్హులందరికీ సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. అనర్హులు పథకాలు పొందకపోయినా పర్లేదుగానీ.. అర్హులకు తప్పనిసరిగా అందాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, మండలస్థాయి అధికారులపై ఉందన్నారు. ఒంగోలు మండలంలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది ఇష్టంగా పనిచేయాలని, కష్టంగా భావించరాదని అన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, ప్రతి సచివాలయంలో మూమెంట్ రిజిష్టర్ ఏర్పాటు చేసుకుని ఫీల్డ్ వర్క్‌కు వెళ్లే సిబ్బంది సమయాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. అధికారులు వచ్చిన సమయంలో మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయకుండా ఫీల్డ్ వర్క్‌లో ఉన్నట్లు చెబితే దాన్ని గైర్హాజరుగానే పరిగణిస్తామన్నారు. సచివాలయ కార్యదర్శులు, అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు మండలంలోని జగనన్న కాలనీల్లో కొందరు లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. ఒంగోలు మండలంలో జగనన్న లే అవుట్లు అధిక వ్యయంతో కొనుగోలు చేయబడ్డాయని, వాటికి తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మెరక తోలడం, రోడ్లు నిర్మించడం వంటి పనులకు కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. ఇంతచేసినా లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తిచేయకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరదన్నారు. ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో అన్ని గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశ కార్యక్రమాలను విజయవంతం నిర్వహించాలని ఆయన కోరారు. సమావేశంలో పీఆర్ ఏఈ శేషగిరి, విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి, హౌసింగ్ ఏఈ పృథ్వీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, మండల వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.వాణి, మండల పశువైద్యాధికారి డాక్టర్ భూపాల్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష, ఒంగోలు ఏవో కిషోర్, విద్యాశాఖ అధికారి కిషోర్‌బాబు, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, ఆర్అండ్‌బీ ఏఈఈ శ్రీకాంత్, ఏపీవో రామరాజు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ తనిఖీ



రాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్

**కొత్తపట్నం:** మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ సరిగా అందుతుందా..లేదా..? అనే విషయంపై మండల స్పెషల్ ఆఫీసర్ అర్చన, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజుపాలెంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మెనూపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేసి పిల్లల ఎత్తు, బరువు సరిచూశారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ పిల్లల విషయంలో అశ్రద్ధ వహించకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై ఉందన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, రికార్డులు సరిగా ఉంచాలని, పిల్లల బోధనాశక్తి పెంచాలని, వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా సరిచూసుకోవాలని సూచించారు. పిల్లలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని చెప్పారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ ద్వారా రాజుపాలెంలోని యాదవపాలెంలో ఏర్పాటు చేసిన వెయ్యి మీటర్ల పైపులైన్‌ను పరిశీలించారు. ఫ్రై డే, డ్రై డేలో భాగంగా ఇళ్లను సందర్శించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఇళ్ల యజమానులకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.వంశీకృష్ణ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

# హ్యాండ్‌బాల్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో, జెడ్పీటీసీ

**చీమకుర్తి:** అండర్–17 బాలికల హ్యాండ్‌బాల్ శిక్షణ తరగతులను డిప్యూటీ డీఈవో అనితారోజ్ రాణి, సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ప్రకాశం జిల్లా జట్టుకు సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో, జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యాలు ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని క్రీడాకారిణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, పీడీలు పాల్గొన్నారు.

# పశుసంవర్థకశాఖ ఏడీ ఆకస్మిక తనిఖీ



కరవది పశువైద్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ నాగభూషణం, లైవ్‌స్టాక్ ఆఫీసర్ లక్ష్మయ్య

**ఒంగోలు రూరల్:** ఒంగోలు నగరంలోని త్రోవగుంట, మండలంలోని కరవది, ఉలిచి గ్రామాల్లో పశువైద్య కేంద్రాలను పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ నాగభూషణం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. తొలుత కరవదిలోని పశు సంవర్థకశాఖ హాస్పిటల్లో రికార్డులు పరిశీలించారు. లైవ్‌స్టాక్ ఆఫీసర్ కె.లక్ష్మయ్యతో మాట్లాడుతూ పాడి పశువుల పెంపకందారులకు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి పశువులు ఎదుర్కొనే సీజనల్ వ్యాధుల నివారణ మార్గాలు తెలియజేయాలని సూచించారు. గడ్డి క్షేత్రాలు పెంచేందుకు పశుపోషకులను ప్రోత్సహించాలన్నారు. కరవదిలో పశు సంపద, పాల ఉత్పత్తి, బంజర భూముల వివరాలు, తదితర అంశాలపై రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు, పశుపోషకులు పాల్గొన్నారు. ఉలిచిలో పశువైద్య కేంద్రాన్ని ఏడీ నాగభూషణం సందర్శించి పాల ఉత్పత్తి పెంచాలని పశుపోషకులకు సూచించారు. పోషకులకు ప్రోత్సాహకాలు అందేలా తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్ ప్రతిమను కోరారు.